

ఫైర్‌కు లైన్స్‌తో చెక్

వేసవికాలంలో అడవుల్లో జరిగే అగ్నిప్రమాదాల నివారణకు జిల్లా అటవీ శాఖ అధికారులు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. 8లో



..ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

భద్రాచలం ఐటీడీఏలో ఏర్పాటుచేస్తున్న మ్యూజియాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని పీఓ రాహుల్ సూచించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 19°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి కొంత మేర చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో గురువారం రామయ్య నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిత్య కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా సువర్ణ పుష్పార్చన



త్రిశూల స్నానం చేయిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయంలో గురువారం అర్చకులు 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం శ్రీ అన్నపూర్ణాసమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా మూలమంత్ర హోమం, జయాధి హోమం, మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవం, త్రిశూల స్నానం, వసంతోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శివ సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 31 వరకు పశుగణన

పాల్వంచరూరల్ : జిల్లాలో పశుగణన కార్యక్రమాన్ని మార్చి 31 వరకు పొడిగించినట్లు పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది నవంబర్ 25న జిల్లాలో గణన ప్రారంభమై ఫిబ్రవరి 28వరకు ముగియాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే పాడిపశువులు, మేకలు, గొర్రెలు, పందులు, కోళ్ల తదితర లెక్కింపు పూర్తి కాకపోవడంతో గడువు పొడిగించామని వివరించారు.

గురుకులాల్లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి



గురుకులంలో వంటలను పరిశీలిస్తున్న జోనల్ ఆఫీసర్ స్వరూపారాణి

నేలకొండపల్లి: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఎస్సెస్సీ, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని గురుకులాల జోనల్ ఆఫీసర్ కె.స్వరూపా రాణి తెలిపారు. నేలకొండపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ రూం, కిచెన్‌ను పరిశీలించాక విద్యార్థులతో కలిసి భోజనం చేయగా మెనూ అమలుపై ఆరా తీశారు. అనంతరం జోనల్ ఆఫీసర్ మాట్లాడుతూ భద్రాద్రి జోన్‌లోని ఐదు జిల్లాల గురుకులాల్లో 19,300 మంది విద్యార్థులు చదువుతుండగా నూతన మెనూ అమలులో రాజీ పడకుండా పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపా రు. అలాగే, ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, వెనకబడిన వారిపై మరింత శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. అలాగే, పరీక్షల వేళ తాజా పండ్లు అందిస్తున్నామని తెలిపారు. కాగా, గురుకులాల్లో ప్రవేశానికి జోనల్ పరిధిలో 25,318 మంది దరఖాస్తు చేసుకోగా 97 శాతం మంది పరీక్ష రాశారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి, ఉద్యోగి పాకనాటి కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపుపైనే ధీమా



భద్రాచలం ఉన్నత పాఠశాల కేంద్రం నుంచి నల్లగొండకు బ్యాలెట్ బాక్సులు తరలిస్తున్న అధికారులు

జిల్లాల వారీగా ఇలా...

జిల్లా	మొత్తం ఓటర్లు	ఓటు వేసింది	పురుషులు	మహిళలు	పోలింగ్ శాతం
ఖమ్మం	4,089	3,804	2,214	1,590	93.03
భద్రాద్రి కొత్తగూడెం	2,022	1,858	973	885	91.94

ప్రశాంతంగా ముగిసిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఖమ్మంలో 93.03, భద్రాద్రిలో 91.94 శాతం పోలింగ్
- వచ్చే నెల 3నుంచి నల్లగొండలో ఓట్ల లెక్కింపు
- విజయంపై అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల లెక్కలు
- బందోబస్తు నడుమ బాక్స్‌ల తరలింపు

సాక్షిప్రతినిధి, ఖమ్మం/కొత్తగూడెంఅర్బన్ : ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం 8 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. అభ్యర్థుల తరఫున ఆయా సంఘాలు, మద్దతిచ్చిన పార్టీల నాయకులు చివరి వరకూ ప్రచారం చేశారు. పోలింగ్ కేంద్రాలకు సమీపాన టెంట్లు వేసుకుని తమ అభ్యర్థికే ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికలు ముగిశాక అభ్యర్థుల వారీగా నమోదైన ఓట్లపై అంచనాలు వేసుకుంటూ విజయంపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 93.03 శాతం, భద్రాద్రి జిల్లాలో 91.94 శాతం పోలింగ్ నమోదైంది.

గతంతో పోలిస్తే ఎక్కువే..

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తక్కువగానే నమోదైంది. అయితే, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు 70 శాతం పైగా నమోదైంది. ఈ సమయాన మహిళా ఉపాధ్యాయులు ఎక్కువగా వచ్చారు. ఇక గత టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పోలిస్తే రెండు జిల్లాల్లో ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. ఉపాధ్యాయ సంఘాల పోటాపోటీ ప్రచారం, మరోవైపు రాజకీయ పార్టీల ప్రవేశంతో పోలింగ్ పెరిగినట్లు తెలుస్తోంది. పోలింగ్ ముగిసే సరికి ఖమ్మం జిల్లాలో 4,089 మందికి గాను 3,804 మంది(93.03శాతం), భద్రాద్రి జిల్లాలో 2,022 మందికి 1,858 మంది(91.94) ఓటు వేశారు. గత ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో 91.22 శాతం, భద్రాద్రి జిల్లాలో 87.66 శాతం పోలింగ్ నమోదైంది.

విజయం మాదంటే మాది..

టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ ముగియడంతో ఉపాధ్యాయ సంఘాలు, మద్దతు ఇచ్చిన పార్టీల నాయకులు కేంద్రాల వారీగా తమ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడ్డాయనే లెక్కలు వేస్తున్నారు. ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు బరిలో నిలవగా అలుగుబెల్లి నర్సిరెడ్డి, పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పులి సరోత్తంరెడ్డి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పూల రవీందర్, సుందర్ రాజ్‌యాదవ్ ఉమ్మడి జిల్లాలో విస్తృత ప్రచారం చేశారు. వీరి తరఫున ఉపాధ్యాయ సంఘాలు, మద్దతు ఇచ్చిన పార్టీల నాయకులు సర్వశక్తులొడ్డారు. కొందరు అభ్యర్థులు పోలింగ్‌కు ముందు రోజు ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారనే ప్రచారం జరిగింది. దీంతో విజయం ఎవరికి దక్కుతుందనే అంశం ఇటు ఉపాధ్యాయ సంఘాలు.. అటు పార్టీల్లోనూ ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

ఇక్కడ వంద శాతం

ఉమ్మడి జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం ఓటింగ్ నమోదైంది. అశ్వాపురం జెడ్పీ స్కూల్ కేంద్రంలో 37 మంది ఓటర్లకు అందరూ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ జెడ్పీ పాఠశాలలో 37 మందికి 37 మంది ఓటు వేశారు. కరకగూడెం జెడ్పీ పాఠశాలలోనూ 19 మందికి అందరూ ఓటేశారు. ఆళ్లపల్లి, చంద్రుగొండలో 15 మంది ఓటర్లకు 15 మంది, బోనకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్రంలో 34 మందికి 34మంది, ఎర్రుపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 55 మందికి అందరూ ఓట్లు వేశారు.

కలెక్టర్, ఎస్పీ పరిశీలన..



డిగ్రీ కళాశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టర్ జితేష్ వి.పాటిల్ లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఇల్లెందు బాలికోన్నత పాఠశాల కేంద్రాన్ని, ఎస్పీ రోహిత్ రాజ్ కొత్తగూడెంలోని సింగరేణి హైస్కూల్‌తో పాటు పాల్వంచలో ఓ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కాగా, జిల్లాలో 463 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధులు నిర్వర్తించారు.





చర్ల పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు, పోలీసులు



ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ వివరాలు

సమయం	ఖమ్మం నమోదు	ఖమ్మం శాతం	భద్రాద్రి కొత్తగూడెం నమోదు	భద్రాద్రి కొత్తగూడెం శాతం
ఉదయం 10	832	20.35	174	8.61
మధ్యాహ్నం 12	2,222	54.34	939	46.44
మధ్యాహ్నం 2	3,252	79.53	1,484	73.66
సాయంత్రం 4	3,804	93.03	1,858	91.94

నేటి నుంచి కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ–2024 ద్వారా నియమితులైన 258 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి మార్చి 3వ తేదీ వరకు మూడు రోజులపాటు వృత్యంతర శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యా విధానంలో పిల్లలకు తరగతి గదిలో బోధన, అభ్యసన కృత్యాలు ఎలా సాగించాలి, వర్క్ బుక్, పాఠ్యపుస్తకాలు ఉపయోగించే విధానం, బహుళ తరగతి బోధన, పరీక్షా విధానాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి 12 మంది జిల్లా రిసోర్స్‌పర్సన్‌లు ఈ నెల 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరై వచ్చారని తెలిపారు. వారు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణా కార్యక్రమానికి అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని వెల్లడించారు.

డ్రోన్ సర్వేతో మాస్టర్ ప్లాన్



గొత్తికోయ ఆవాసాల్లో పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు

- పాల్వంచ మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాల్వంచ మున్సిపల్ అభివృద్ధికి డ్రోన్ సర్వేతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన తదితరులతో కలిసి డ్రోన్‌కు పూజ చేసి సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు అన్నీ డిజిటలైజ్ చేయడమే లక్ష్యమని అన్నారు. అధునాతన సాంకేతికత, డ్రోన్ కెమెరాల సాయంతో పకడ్బందీగా సర్వే చేస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం ద్వారా రాష్ట్రంలో 50 వేల నుంచి లక్ష జనాభా కలిగిన 20 మున్సిపాలిటీలను మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వేకు ఎంపిక చేయగా.. జిల్లాలో పాల్వంచ మున్సిపాలిటీకి చోటు దక్కిందని వివరించారు. ఈ సర్వేతో పాల్వంచ పట్టణం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఉపగ్రహాలు, డ్రోన్ల సాయంతో ప్రాంతాల వారీగా ఉపరితలం ఎత్తు, పరిస్థితులు, రోడ్లు, ఇళ్లు, టాయిలెట్లు, డ్రెయినేజీలు, తాగునీటి పైపులైన్లు, సెల్ టవర్లు, రిజర్వాయర్లు, మార్కెట్లు, వైకుంఠధామాలను చిత్రీకరించి బేస్ మ్యాప్‌లను తయారు చేస్తారని వివరించారు.

సీతారామ బ్రిడ్జి పరిశీలన..

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : మండలంలోని గుంపెన గ్రామ శివారులో సీతారామ కాల్వపై రూ.6 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం పరిశీలించారు. బ్రిడ్జి నిర్మించే క్రమంలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన అప్రోచ్ రోడ్డును వెంటనే తొలగించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ అర్జున్, డీఈ భాస్కర్, ఆర్ఐ మధు పాల్గొన్నారు.

గొత్తికోయ ఆవాసాల్లో పర్యటన..

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడుచెలక గ్రామపంచాయతీ పరిధిలోని చింతలమేడి, మద్దిగుంపు గొత్తికోయ ఆవాసాల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ పర్యటించారు. వారి జీవన స్థితిగతులు, అందుతున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ఆ రహదారిలో కారు వంటి వాహనాలు వెళ్లే వీలు లేకపోవడంతో మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్‌తో కలసి ద్విచక్రవాహనంపై చేరుకున్నారు. తాగునీటి కోసం అక్కడి గిరిజనులు ఏర్పాటు చేసుకున్న చెలిమలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అటవీ సంపదను కాపాడాలని, పోడు కొట్టడం చట్ట వ్యతిరేకమని, ఎవరూ చెట్లను నరకవద్దని సూచించారు. గొత్తికోయల అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్నామని, విద్య, వైద్య, రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. చింతలమేడిలో నివసించే ఆరు కుటుంబాల వారు రోడ్డు సమీపంలోకి రావాలని, వారికి మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇవ్వగా త్వరలో తమ నిర్ణయం తెలియజేస్తామని స్థానికులు కలెక్టర్‌కు చెప్పారు. గ్రామంలో తాగునీరు కోసం సంపు నిర్మించాలని మిషన్ భగీరథ ఈఈని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ చలపతిరావు, మిషన్ భగీరథ డీఈ శివయ్య, ఏఈ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న భానుమతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గొల్లపూడి భానుమతి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భానుమతి మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడడం నేరమని అన్నారు. ఈ వేధింపుల నివారణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. మహిళల రక్షణ కోసం చట్టం అనే బలమైన సాధనం ఉందన్నారు. మహిళా సాధికారతకు వ్యక్తులు, వ్యవస్థల సహకారం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై సహోద్యోగులు లైంగిక వేధింపులకు పాల్పడితే బాధిత మహిళలు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల భవిష్యత్ ప్రణాళికలో ఆర్థిక అక్షరాస్యత కూడా కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. మహిళలు జీవనజ్యోతి, ప్రధానమంత్రి యోజన తదితర పథకాలను వినియోగించుకోవాలని, వాటిపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంరెడ్డి, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రాజబాబు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘సీతారామ’ నీరు విడుదల



దుమ్ముగూడెం ఆనకట్టపై ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి (ఇన్‌సెట్) దిగువకు విడుదలవుతున్న నీరు



పంప్‌హౌస్ నుంచి సాగర్ కెనాల్‌కు తరలింపు

అశ్వాపురం: మండలంలోని బీజీ కొత్తూరు వద్ద సీతారామ ప్రాజెక్ట్ ఫేస్ – 1 పంప్‌హౌస్ ద్వారా అధికారులు గురువారం నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు రోజుల క్రితం వరకు ఆనకట్ట వద్ద నీరు తక్కువగా(49.1 మీటర్లు) ఉండడంతో తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి 1,200 క్యూసెక్కుల నీటిని ఇటీవల విడుదల చేశారు. కాగా, గురువారం 49.6 మీటర్లకు నీటి మట్టం చేరి ఆనకట్టపై గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో బీజీ కొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు.

వారం రోజులుగా కసరత్తు..

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా నాగార్జునసాగర్ కెనాల్‌కు గోదావరి జలాలు తరలించేందుకు అధికారులు గత వారం రోజులుగా కసరత్తు చేస్తున్నారు. కుమ్మరిగూడెం నుంచి జూలూరుపాడు వరకు సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ 112.4 కిలోమీటర్ల మేర గోదావరి జలాలు ప్రవహించి ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా నాగార్జునసాగర్‌కు తరలించనున్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువకు అడ్డుగా ఉన్న బెల్‌మౌత్ మట్టి కట్టను తొలగించడంతో నీరు మొదట అమెర్ద వద్ద హెడ్ రెగ్యులేటర్ వరకు వచ్చాయి. అక్కడి నుంచి బీజీ కొత్తూరు పంప్‌హౌస్ వరకు నీరు చేరింది. పంప్‌హౌస్ ద్వారా నీరు ఎత్తిపోయడంతో 43.9 కిలోమీటర్ల దూరంలోని ములకలపల్లి మండలం పూసుగూడెం ఫేస్–2 పంప్‌హౌస్‌కు చేరుతాయి. అక్కడ ఎత్తిపోస్తే 57.2 కిలోమీటర్ల దూరంలో కమలాపురంలో ఫేస్–3 పంప్‌హౌస్‌కు చేరుతాయి. ఆపై కాలువ ద్వారా అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ, జూలూరుపాడు వరకు చేరుతాయి. జూలూరుపాడులో 100.09 కిలోమీటర్ వద్ద నుంచి ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా 8 కిలోమీటర్లు పయనించి నాగార్జునసాగర్ కెనాల్‌లోకి చేరనున్నాయి.

మాస్టర్ ప్లాన్‌తోనే మహర్దశ

- ఎదురుచూస్తున్న భక్తులు, స్థానికులు
- నవమి వేడుకల్లో రేవంత్ ప్రకటనపైనే కోటి ఆశలు
- తొలిసారి సీఎం హోదాలో హాజరయ్యే అవకాశం
- నిధులు కేటాయిస్తే ఆలయాభివృద్ధికి బాటలు



భద్రాచలం రామాలయం

భద్రాచలం : దేశ వ్యాప్తంగా భక్తులు ఎదురుచూసే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు సమయం సమీపిస్తోంది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 6న శ్రీరామనవమి, 7న పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. వీటికి ముందు ఉగాది రోజునే స్వామి వారి పెళ్లి పనులు ప్రారంభిస్తారు. ఈసారి సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారి స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనే అవకాశం ఉండగా నూతన మాస్టర్ ప్లాన్, నిధుల విడుదలపై ఏం ప్రకటన చేస్తారోనని భక్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

గతేడాది ఎన్నికల కోడ్..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది జరిగే స్వామివారి కల్యాణం రెండోది. గత శ్రీరామనవమి సమయంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో సీఎం రేవంత్‌రెడ్డి కల్యాణానికి హాజరు కాలేదు. దీంతో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులే పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఈ సంవత్సరం నవమి వేడుకల సమయంలో ఎన్నికల కోడ్ ఉండే సూచనలు లేకపోవడంతో సీఎం హోదాలో ఆయన తొలిసారి హాజరవుతారని అంచనా. బీఆర్‌ఎస్ హయాంలో సీఎంగా ఉన్న కేసీఆర్ 2014, 2015లో మాత్రమే స్వామివారి కల్యాణానికి హాజరయ్యారు. ఆ తర్వాత మంత్రులు, అధికారులే పట్టువస్త్రాలు అందించే సంప్రదాయం కొనసాగింది. సుమారు దశాబ్ద కాలం తర్వాత సీఎం హాజరయ్యే అవకాశం ఉండగా, ఆలయాభివృద్ధికి ఎలాంటి ప్రకటన చేస్తారోనని భక్తులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఎన్నికలకు ముందే హామీ..

గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా 2023 ఫిబ్రవరి 14న రేవంత్‌రెడ్డి భద్రాచలం వచ్చారు. రామాలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామన్న కేసీఆర్ మాట తప్పారని, తాము అధికారంలోకి వస్తే ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆయన అధికారంలోకి వచ్చాక 2024 మార్చి 11న మరోసారి భద్రాచలం రాగా, ఆలయంలో చేపట్టాల్సిన పనులపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, అధికారులతో చర్చించారు. భక్తులకు మౌలిక వసతులతో పాటు ఇతర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయాధికారులతో చర్చించి రామాలయంతో పాటు పర్ణశాల అభివృద్ధికి చేపట్టాల్సిన పనుల నివేదికలు రూపొందించారు. ఆలయ మొదటి ప్రాకారం, దేవస్థానం, కల్యాణ మండపం రెండు వైపులా విస్తరణ, మాడ వీధులు, రాజ వీధుల విస్తరణ, కోనేరు నిర్మాణంతో పాటు రామాలయం నుంచి నృసింహస్వామి ఆలయం వరకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సంస్కృత, సంగీత పాఠశాల, పురుషోత్తపట్నంలో గోశాల నిర్మాణం, పర్ణశాల వద్ద దేవాలయం విస్తరణ, ప్రాకార మండపాల నిర్మాణం, కల్యాణ మండపం తదితర పనులతో ప్రణాళిక రూపొందించారని సమాచారం. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన స్థపతి సూర్యనారాయణ మూర్తి నూతన మాస్టర్ ప్లాన్ స్కెచ్‌లను సిద్ధం చేస్తున్నారు.

బడ్జెట్‌లో కేటాయింపే కీలకం..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి భద్రాచలం దేవస్థానం అభివృద్ధి హామీలపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ సాగుతోంది. గత సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు ప్రకటించి.. బడ్జెట్‌లో కేటాయించినా నిధులు మాత్రం విడదల చేయలేదు. దీంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల ముందు, ఆ తర్వాత హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా రామాలయ అభివృద్ధికి కట్టుబడి ఉండాలని భక్తులు అంటున్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

అభివృద్ధి చేసి చూపించాలి



భద్రాచలం అభివృద్ధికి ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి వెంటనే నిధులు ప్రకటించాలి. వీలైనంత త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. ఇటీవల భక్తుల రాక పెరిగినందున వసతుల కల్పనపై దృష్టి సారించాలి.

– రేపాక రవికిరణ్, భద్రాచలం

క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

చుంచుపల్లి: కొత్తగూడెం, ఇల్లెందు పట్టణ పరిసర ప్రాంతాల ఆర్టీసీ ప్రయాణికులకు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూచనలు, సలహాలు, ఫిర్యాదుల కోసం 99592 25959 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అంతర్జాతీయ కథల పోటీల్లో బహుమతి


బహుమతి పొందిన సాత్విక్

అశ్వారావుపేటరూరల్: అంతర్జాతీయ కథల పోటీల్లో అశ్వారావుపేటకు చెందిన బాలకథా రచయిత సిద్ధంతాపు సాత్విక్‌కు బహుమతి లభించింది. తెలుగు తల్లి కెనడా, గడుగ్గాయి పిల్లల మాసపత్రిక నిర్వాహకులు అంతర్జాతీయస్థాయిలో పోటీలు నిర్వహించారు. సాత్విక్ రాసిన 'నిజాయితీ విలువ' కథను పంపించగా ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాన్ని ఈ మెయిల్ ద్వారా పంపినట్లు బాలుడి తండ్రి ప్రభాకరాచార్యులు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో బహుమతి రావడంపట్ల హర్షం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు అభినందనలు


విశ్వామిత్రను అభినందిస్తున్న హరీశ్‌రావు, తదితరులు

చుంచుపల్లి: హనుమకొండలో ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో వాక్ ఫర్ ట్రీస్ నినాదంతో ప్రతిరోజు మొక్క నాటుతున్న కొత్తగూడెంకు చెందిన చిన్నారి విశ్వామిత్ర చౌహాన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ రాకేశ్‌రెడ్డి ఆయనను సన్మానించి మాట్లాడారు.

సింగరేణి కార్మికులు నేరుగా రిఫరల్‌కు..!

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు గతంలో ఏ రిఫరల్ కావాలన్నా ఆస్పత్రి చుట్టూ, హెడ్డాఫీస్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు గని మేనేజర్, వెల్ఫేర్ ఆఫీసర్ ద్వారా లెటర్ అప్రూవల్ చేసుకుంటే సరిపోతుందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ బి.జనక్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసరంగా ఆస్పత్రిలో చేరిన ఉద్యోగి బంధువులు మెరుగైన వైద్యం కోసం గతంలో మాదిరిగా కార్యాలయాలు, ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని వెల్లడించారు. రెండు ఫొటోలతో కూడిన దరఖాస్తు తీసుకొస్తే కార్పొరేట్ ఆస్పత్రిలో రిఫరల్‌కు వెళ్లవచ్చునని తెలిపారు. ఈ విషయమై తాను సింగరేణి ఉన్నతాధికారులతో చర్చించడంతో అనుమతించారని, త్వరలోనే సర్క్యులర్ జారీ అవుతుందని పేర్కొన్నారు.

సింగరేణి ప్రధానాస్పత్రిలో ఖరీదైన శస్త్రచికిత్స

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధానాస్పత్రిలో ఓ మహిళకు ఖరీదైన శస్త్రచికిత్స నిర్వహించారు. సింగరేణి ఉద్యోగి భార్య గైనిక్ సమస్యతో బాధపడుతుండగా కొత్తగూడెంలోని ప్రధాన ఆస్పత్రిలో చేర్పారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి సీనియర్ గైనకాలజిస్ట్ మాలతి శస్త్రచికిత్స నిర్వహించి గర్భాశయంలో ఉన్న కణుతులను తొలగించారు. ఈ కేసును హైదరాబాద్‌కు రిఫర్ చేస్తే సుమారు రూ. 3 లక్షల వరకు ఖర్చయ్యేదని వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్సలో డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రవళి, థియేటర్ సిబ్బంది సహకరించారు.

బొగ్గు టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : మండలంలోని గుంపెన గ్రామం వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. అబ్బుగూడెం గ్రామానికి చెందిన గడ్డం శ్రీను తన ద్విచక్రవాహనంపై ఎర్రగుంట నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న బొగ్గు టిప్పర్ ఢీకొట్టింది. దీంతో శ్రీను కిందపడగా, అతని కాలుపై నుంచి టిప్పర్ టైరు వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయింది. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్

సత్తుపల్లిటౌన్: ఆర్‌ఎంపీలు ప్రాథమిక చికిత్స కాకుండా ఆస్పత్రుల పేరిట పడకలు ఏర్పాటు చేసి వైద్యం నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి హెచ్చరించారు. సత్తుపల్లి ఎన్టీఆర్‌నగర్‌లో ఓ ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌లో బెడ్లు ఉండడంతో పాటు ఫార్మసీ నిర్వహిస్తుండగా గురువారం ఆమె సీజ్ చేసి మాట్లాడారు. అనంతరం సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల శిబిరం, గంగారం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు.

ఫైర్‌కు లైన్స్‌తో చెక్

- రూ.55 లక్షలతో 489 కిలోమీటర్ల ఫైర్‌లైన్స్
- జిల్లాలోని ఆరు డివిజన్లలో సాగుతున్న పనులు
- 14 ఫైర్ బ్లో బృందాలనూ ఏర్పాటు చేసిన అటవీశాఖ
- అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



అటవీప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫైర్ లైన్

పాల్వంచరూరల్: వేసవికాలంలో అటవీ ప్రాంతంలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తోంది. ఎండాకాలంలో అడవుల సంరక్షణకు ఈ ఏడాది ముందే దృష్టి సారించింది. జిల్లాలో అటవీ విస్తీర్ణం 4,28,698 చదరపు కిలోమీటర్లు ఉండగా, 6 డివిజన్లు, 24 రేంజ్‌లు, 944 బీట్లు ఉన్నాయి. వేసవి కాలంలో చెట్ల ఆకులు నేలరాలి ఎండిపోతుంటాయి. అడవిలోకి వెళ్లిన వారు బీడీలు, చుట్టలు, సిగరెట్లు కాల్చివేయడం ద్వారా ఎండిన ఆకులకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగి అడవి దహనమవుతుంటుంది. ఈ క్రమంలో అగ్ని ప్రమాదాల నివారణకు ఏటా అటవీశాఖ ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తోంది. గతేడాది కిన్నెరసాని అభయారణ్యం, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, భద్రాచలం డివిజన్ల పరిధిలో రూ.19,45,197 కంపా నిధులతో 122.65 కిలోమీటర్ల మేర ఫైర్‌లైన్స్ నిర్మించింది. ఈ ఏడాది కూడా కంపా నిధులు కూడా రూ.55.60 లక్షలతో 489 కిలోమీటర్ల పరిధిలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తోంది. వేసవిలో అటవీప్రాంతంలో మంటలు అంటుకోకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ఆరు డివిజన్ల పరిధిలో అధికంగా, తరచూ అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను గుర్తించారు. గుండాల, మణుగూరు, ఇల్లెందు, భద్రాచలం, చర్ల అటవీ ప్రాంతాలను ముప్పు ఉన్నట్లు గుర్తించి ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా 14 ఫైర్ బ్లో బృందాలను కూడా ఏర్పాటు చేశారు.

గిరిజన కూలీలకు ఉపాధి

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ శాఖ ప్రతి సంవత్సరం చేపడుతున్న ఫైర్ లైన్స్ ఏర్పాటు పనులతో సుమారు వెయ్యి మంది గిరిజనులకు ఉపాధి అవకాశం లభిస్తుంది. దాదాపు నెలరోజులపాటు కూలీలకు పని దొరుకుతుంది.

వాచర్ల నియామకం లేనట్లేనా..?

వేసవికాలంలో అడవులకు నిప్పు అంటుకుని ప్రమాదాలకు గురి కాకుండా ముందస్తు సమాచారం ఇచ్చేందుకు అటవీశాఖ ఫైర్‌వాచర్లను నియమిస్తుంది. ఏటా బీట్ల వారీగా నియామకాలు చేపడుతుంది. కానీ ఈ సంవత్సరం ఫైర్ వాచర్లను నియమించలేదు. అగ్ని ప్రమాదం సంభవించిన సమాచారం ఆలస్యంగా అందితే అడవులు కాలిపోతాయి. అయితే నిధుల కొరతతో ఫైర్‌వాచర్లను నియమించనట్లు తెలుస్తోంది.


అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

గతేడాది ఇలా..

2024–2025 సంవత్సరంలో 122.65 కిలోమీటర్ల ఫైర్‌లైన్ల విస్తరణకు రూ.19.45 లక్షలు ఖర్చు చేశారు. పాల్వంచ కిన్నెరసాని అభయారణ్యంలో 19.5 కిలోమీటర్లకు రూ.9.19 లక్షలు వ్యయం చేశారు. కొత్తగూడెం డివిజన్ పరిధిలో 22 కిలోమీటర్ల లైన్స్‌కు రూ.2.19 లక్షలు, భద్రాచలం డివిజన్ పరిధిలో 13.7 కిలోమీటర్లకు రూ.1.36 లక్షలు, మణుగూరు డివిజన్‌లో 15.75 కిలోమీటర్లకు రూ.1.75 లక్షలు, పాల్వంచ డివిజన్‌లో 19.70 కిలోమీటర్లకు రూ.2.70 లక్షలు, ఇల్లెందు డివిజన్ పరిధిలో 32.55 కిలోమీటర్లకు రూ.3.24 లక్షలు ఖర్చు చేశారు.

డివిజన్ల వారీగా కేటాయించిన నిధులు

డివిజన్	కిలోమీటర్లు	వ్యయం (రూ.లక్షల్లో)
కొత్తగూడెం	50	5.70
ఇల్లెందు	227	27.46
పాల్వంచ	15	1.23
మణుగూరు	75	7.83
భద్రాచలం	42	4.38
వైల్డ్‌లైఫ్	80	9

ప్రత్యేక చర్యలు



జిల్లాలోని అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. ఫైర్‌లైన్స్ నిర్మాణ పనులు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయి. ఫైర్‌లైన్స్ ద్వారా అగ్నిప్రమాదాల తీవ్రతను తగ్గించి పూర్తిస్థాయిలో అడవిని రక్షించగలుగుతున్నాం. వేసవిలో అధిక అగ్ని ప్రమాదాలు సంభవించే ఐదు ప్రాంతాలను గుర్తించాం. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజల్లో కూడా అవగాహన కల్పిస్తున్నాం. అడవిలోకి ఎవరైనా అగ్గిపెట్టె తీసుకుని వెళ్లి నిప్పు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఫైర్ బ్లో ద్వారా కూడా అగ్ని ప్రమాదాలను నివారిస్తున్నాం.

–కృష్ణాగౌడ్, జిల్లా అటవీశాఖాధికారి

మ్యూజియంను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. మ్యూజియం కమిటీ సభ్యులతో కలిసి ఆయన గురువారం మ్యూజియం పరిసరాల్లో ఏర్పాటు చేస్తున్న బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌తోపాటు బోటింగ్ కోసం సిద్ధం చేసిన చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 10వ తేదీలోగా పనులు పూర్తి కావాలని చెప్పారు. అన్ని గిరిజన తెగల ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన బుక్ లెట్ తయారు చేయించాలని, కోయ భాషలో స్వాగతం పలికే పెయింటింగ్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, ఉదయభాస్కర్, ప్రభాకర్ రావు, హరీష్, హరికృష్ణ, గోపాల్ రావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.


మ్యూజియం పనులను పరిశీలిస్తున్న పీఓ, కమిటీ సభ్యులు

గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

అశ్వాపురం: గిరిజన రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. మండల పరిధిలోని చింతిర్యాలగూడెంలో విఘ్నేశ్వర రైతు ఉత్పత్తి దారుల సంఘం గోదాంను గురువారం ఆయన సందర్శించారు. యంత్ర పరికరాలు అందజేయాలని రైతులు ఈ సందర్భంగా పీఓను కోరారు. అనంతరం పీఓ మాట్లాడుతూ అశ్వాపురంలో 550 మెట్రిక్ టన్నుల గోదాం ఉన్నందున రైతులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. నాబార్డు, ఐటీడీఏ సహకారంతో అందించిన ట్రాక్టర్, యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటలపై మందులు చల్లేందుకు స్ప్రే డ్రోన్ యంత్రం మంజూరుకు కృషి చేస్తామన్నారు.

టీచర్ ఎమ్మెల్సీగా నర్సిరెడ్డి గెలుపు ఖాయం



టేకులపల్లిలో మాట్లాడుతున్న చావా రవి

టేకులపల్లి: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మరోమారు అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలుపు ఖాయమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ సందర్భంగా టేకులపల్లిలో గురువారం పోలింగ్ కేంద్రాల వద్ద ఆయన ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. గత ఆరేళ్లలో ఉపాధ్యాయులు, సీఆర్టీలు, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసమే కాక విద్యారంగ అభివృద్ధికి నర్సిరెడ్డి కృషి చేశారని తెలిపారు. తద్వారా మరోమారు ఆయనను గెలిపించాలని ఉపాధ్యాయులు నిర్ణయించుకున్నారని చెప్పారు. ఉద్యమ సంఘాలైన టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ బాధ్యులంతా ఇందుకోసం కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.హరిలాల్‌నాయక్‌తో పాటు టీపీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు బి.కిషోర్‌సింగ్, వి.వరలక్ష్మి, బి.మాన్‌సింగ్, డి.హరికుమార్, బి.రామరాజు, రేపాకుల శ్రీనివాస్, ఎం.డీ.మౌలానా, టి.బిక్షమయ్య, వి.కాంతారావు, గుమ్మడి కృష్ణవేణి, మంజీలాల్, బి.వీరన్న, కడుదుల వీరన్న, ఈసం నర్సింహారావు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు రూ.50వేల ఆర్థికసాయం

మణుగూరు టౌన్: నిరుపేద యువతి అంత్యక్రియలు పూర్తి చేసేందుకు రూ. 50 వేలు ఆర్థికసాయం అందించి దాతలు మానవత్వం చాటుకున్నారు. ముత్యాలమ్మనగర్‌కి చెందిన ఎం.శాంతి(24) అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో తల్లిదండ్రుల వద్ద అంత్యక్రియలకు డబ్బు లేక ఇంటి ఆరుబయటే మృతదేహాన్ని ఉంచి రోదిస్తున్నారు. దయనీయ దృశ్యాన్ని గమనించిన చంద్రశేఖర్ అనే వ్యక్తి సామాజిక మాధ్యమంలో పోస్టు చేయగా, జిల్లాలోని పలువురు ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. ఒక్కొక్కరు రూ. 500 నుంచి రూ. 5 వేల వరకు ఫోన్ పే ద్వారా విరాళం అందించారు. రూ.50 వరకు సాయం అందింది.


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వేతనం రూ.300 వచ్చేలా చూడాలి

దుమ్ముగూడెం : ఉపాధి హామీ కూలీలకు రోజువారీ వేతనం రూ.300 వచ్చేలా పని కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని బట్టిగూడెం, మహాదేవపురం గ్రామపంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫామ్‌పాండ్స్, మునగ తోట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని ప్రదేశాల వద్ద నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగునీటి సమస్య ఉందని కూలీలు ఆమె దృష్టికి తేగా, వెంటనే ఎంపీడీఓ రామకృష్ణ, మిషన్ భగీరథ ఇంజనీర్లను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుకన్య, ఈసీలు అప్పారావు, రాజు, టీఏ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మునగ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

కల్లంలో ఆరబోసిన మిర్చి చోరీ

కామేపల్లి: కల్లంలో ఆరబెట్టిన మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన ఇది. మండలంలోని ముచ్చర్లకు చెందిన రైతు జాల శివకృష్ణ ఇటీవల మిర్చి కోయించి కల్లంలో ఆరబెట్టాడు. బుధవారం తీర్థాల జాతరకు వెళ్లిన ఆయన గురువారం తెల్లవారుజామున కల్లం వద్దకు వచ్చేసరికి సుమారు 10 బస్తాల్లో మిర్చిని ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. అంతేకాక మరో ఎనిమిది బస్తాల్లో మిర్చి నింపి ఉండడంతో చుట్టుపక్కల గాలించగా.. ఎలక్ట్రికల్ స్కూటీ కనిపించింది. చోరీ చేసిన మిర్చి విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, నిందితులను గుర్తించి తనకు న్యాయం చేయాలని శివకృష్ణ చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

వైభవంగా తిరువీధి సేవ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి అనుబంధ ఆలయమైన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో గురువారం రాత్రి తిరువీధి సేవ వైభవంగా సాగింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో బుధవారం రాత్రి శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయం నుంచి మేళతాళాల నడుమ తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, వైదిక సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.


తిరువీధి సేవలో పాల్గొన్న ఆలయ ఈఓ రమాదేవి

వీరు పూర్వ విద్యార్థులే!



పెనుబల్లి : అందరి వయస్సు 75 ఏళ్లు దాటింది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వీరి పిల్లలు చేతికి రావడంతో మనవళ్లు, మనవరాళ్లతో శేషజీవితం గడుపుతున్నారు. అయితే, నాటి పెనుబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.. ప్రస్తుత వీఎం బంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1965–64లో వీరందరూ 11వ తరగతి(హెచ్‌ఎస్‌సీ) చదివారు. పాఠశాలలో వీరికి రెండో బ్యాచ్‌గా 11మంది ఉండేవారు. ఇందులో తొమ్మిది మంది ఇటీవల కలుసుకోవాలని నిర్ణయించుకుని గురువారం పాఠశాలకు చేరుకుని ఆనాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన గురువులు, తమను వీడిపోయిన మిత్రులను స్మరించుకున్నారు. పాఠశాల ఏర్పాటుకు కృషి చేసిన దివంగత సీఎం వెంగళరావు సేవలను కొనియాడారు. ఆనాటి విద్యార్థులైన వంగా నరసింహాస్వామి, ఏటుకూరి రామారావు, కాటోజు మునేశ్వరరావు, బజ్జూరి వెంకటేశ్వరరావు, దామెర ప్రసాద్ రావు, పోలకంపల్లి ధనుంజయ్‌రావు, సోమరాజు నాగభూషణ్‌రావు, ఏటుకూరి చిన్న కృష్ణారావు, వంగల రంగాచారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కరకగూడెం: మండల పరిధిలోని భట్టుపల్లి అటవీ ప్రాంతంలో గుబ్బల మంగమ్మ గుడి సమీపంలో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, నాలుగు సెల్ ఫోన్లు, ఐదు బైక్‌లు, రూ.7500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామంలో కోడి పందేల స్థావరంపై సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పోలీసులు దాడి చేశారు. రూ. 3 వేల నగదు, ఐదు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు కార్లు ఢీ

నలుగురికి గాయాలు

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ గ్రామ సమీపంలో తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రహదారిపై గురువారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొని నలుగురు గాయపడ్డారు. కొత్తగూడేనికి చెందిన సింగరేణి ఉద్యోగులు ప్రశాంత్, శ్రీనివాస్, తిరుమలరెడ్డి కారులో ఖమ్మం వెళ్తున్నారు. సుజాతనగర్ శివాలయం ఈఓ చంద్రశేఖర్ హరి తన కారులో ఖమ్మం నుంచి సుజాతనగర్ వెళుతున్నారు. ఈ క్రమంలో వినోభానగర్ సమీపంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నలుగురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఈఓను ఖమ్మం ఆస్పత్రికి, సింగరేణి ఉద్యోగులను కొత్తగూడెంలో సింగరేణి ప్రధాన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

అక్రమ రిజిస్ట్రేషన్ల కేసులో 9మందిపై కేసు

కొణిజర్ల: కొణిజర్ల మండలం లింగగూడెం, అమ్మపాలెం పరిధి ఇండోఖతార్ వెంచర్స్‌లో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించిన ఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ గుగులోత్ సూరజ్ గురువారం తెలిపారు. గ్రీన్‌ల్యాండ్ వెంచర్స్ యజమానులు నాలుగేళ్ల క్రితం వెంచర్‌లో విల్లాల డెవలప్‌మెంట్ కోసం పాలిశెట్టి గిరికి కొంత స్థలం అప్పగించారు. ఆయన విల్లాలు నిర్మించి అమ్ముతుండగా, గత ఏడాది డిసెంబర్ 28న వెంచర్స్ యజమానులు తనకు తెలియకుండా 64 ప్లాట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారని, అందులో అప్పటికే అమ్మేసిన విల్లాలు కూడా ఉన్నాయని వైరా ఏసీపీ, సబ్ రిజిస్ట్రార్‌కు గిరి ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ అనంతరం ఎం.రాము, ఎం.కిషోర్, కె.శరత్, బి.రాంబాబు, అరవింద్, అజయ్, వసీమ్, రాజా, ఉపేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి హత్య కేసులో జీవిత ఖైదు

ప్రేమ పేరుతో తీసుకెళ్లిన యువకుడు హత్య చేసినట్లు నిర్ధారణ

పెనుబల్లి: యువతిని హత్య చేసిన కేసులో వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ సత్తుపల్లి ఆరో అదనపు జడ్జి ఎం.శ్రీనివాస్ గురువారం తీర్పు వెలువరించారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లకు చెందిన కావటి తేజస్విని గంగారంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదివేది. సత్తుపల్లికి చెందిన బెల్లేడు నితిన్ ప్రేమ పేరుతో ఆమె వెంట పడగా, మాయమాటలు చెప్పి ఇంటి నుంచి 2019 ఆగస్టులో బైక్‌పై తీసుకెళ్లిన ఆయన లంకపల్లి గుట్టల వద్ద కర్చీఫ్‌తో ఉరివేసి హతమార్చాడు. ఘటనపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేయగా.. సీఐలు టి.సురేష్‌కుమార్, టి.రవికుమార్, టి.కరుణాకర్ దశల వారీగా విచారణ జరిపి నితిన్‌ను నిందితుడిగా గుర్తించి సత్తుపల్లి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణ అనంతరం నితిన్ నిందితుడిగా తేలడంతో జీవిత ఖైదు విధించడమే కాక రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని సత్తుపల్లి రూరల్ సీఐ ఎం.ఎల్.ముత్తిలింగయ్య తెలిపారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అబ్దుల్ పాషా కేసు వాదించగా ఉద్యోగులు కె.శ్రీకాంత్, డి.నాగేశ్వరరావులు, కె.గిరి సహకరించారు. కాగా, తీర్పు వెలువడ్డాక నిందితుడిని వీఎంబంజర్ ఎస్సై కె.వెంకటేష్ సబ్‌జైల్‌కు తరలించారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

దమ్మపేట: బైక్‌ను లారీఢీకొని యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని అచ్యుతాపురం క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... అశ్వారావుపేట మండలం పేరాయిగూడేనికి చెందిన యువకు డు రమేష్ సత్తుపల్లి మండలం గంగారంలోని ఓ వ్యక్తి వద్ద కార్ డ్రైవింగ్ చేస్తున్నాడు. గురువారం విధులు ముగించుకుని బైక్‌పై గంగారం నుంచి అశ్వారావుపేటకు బయలుదేరాడు. ఈ క్రమంలో అచ్యుతాపురం క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రమేష్‌కు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

గుండె నొప్పితో సింగరేణి కార్మికుడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లిలోని కిష్టారం ఓసీలో ట్రిప్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బొడ్డు శ్రీనివాస్(52) గురువారం గుండె నొప్పితో మృతి చెందాడు. అతను ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలో షిప్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా, మేకప్‌మెన్‌గా కూడా పనిచేస్తున్నాడు. గురువారం వార్షికోత్సవం సందర్భంగా సెయింట్ మేరీస్ పాఠశాలలో పిల్లలకు మేకప్ వేసి ఇంటికి వెళ్తూ ఒకేసారి కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.